క్లుప్తంగా

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

నారాయణఖేడ్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఖేడ్ పట్టణంలో మంగళవారం పార్టీ నాయకులు ప్రారంభించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలు, విధానాలను వివరిస్తూ సభ్యత్వ నమోదు చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రవిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, దశరథ్, ప్రశాంత్, పట్నం మాణిక్, సతీష్, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



ర్యాకల్ గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నారాయణఖేడ్: నియోజకవర్గంలో బతుకమ్మ సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు ఖేడ్ మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు గ్రామ కూడళ్లలో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు బతుకమ్మ ఆటపాటలతో గ్రామాల్లో సందడి నెలకొంది.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రామానాయుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హద్నూర ఎస్ఐ రామానాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని గుంజేటి గ్రామంలో సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ రమ్మీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చేఫోన్ కాల్స్‌కు స్పందించొద్దన్నారు. ఎలాంటి లింకులను ఓపెన్ చేయరాదన్నారు. ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడి యువత డబ్బులు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రాంతీర్థ్ గ్రామ శివారులో పేకాట శిబిరంపై మంగళవారం హద్నూర పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం.. పేకాట స్థావరంపై దాడి చేసి, పది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.40.950, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

మునిపల్లి(అందోల్): కంకోల్ నుంచి తాటిపల్లి మీదుగా కప్పాడ్ వరకు గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతుల పనులు సాగుతున్నాయి. మంగళవారం బీటీరోడ్డుకు కంకర వేసే పనులు నిర్వహించారు. నేడు (బుధవారం) రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ వస్తుండడంతో సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతుల పనులు శరవేగంగా చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బీటీ రోడ్డుపై గుంతలుపడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మరమ్మతుల పనులు చేపట్టారు.

నేడు రాయికోడ్‌కు మంత్రి రాక

మునిపల్లి(అందోల్): రాయికోడ్ గ్రామానికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ బుధవారం వస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.11 గంటలకు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీస్ కథనం ప్రకారం.. ఇస్నాపూర్ పద్మారావు నగర్ కాలనీకి చెందిన సునీల్ కుమార్ భార్య బాదల్ ఈ నెల 7న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



నారాయణఖేడ్: మహాలక్ష్మీదేవిగా నల్లపోచమ్మ



సదాశివపేట పట్టణంలోని వాసవీ కన్యాకపరమేశ్వర మందిరంలో..



నారాయణఖేడ్: మహాలక్ష్మీదేవిగా భవానిమాత

మహాలక్ష్మీదేవిగా...

శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం దుర్గామాత భక్తులకు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పంచామృత అభిషేకం, మహానైవేద్యం సమర్పణ, నక్షత్రహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల నిర్వాహకులు భక్తులకు కోలాటాలు, అన్నదానం చేశారు.



రాయికోడ్ మహాలక్ష్మీదేవి రూపంలో..



న్యాల్‌కల్ (జహీరాబాద్): మహాలక్ష్మీదేవి రూపంలో అమ్మవారు



సంగారెడ్డి టౌన్ : లక్ష్మీదేవి అలంకరణలో..



ఝరాసంగం(జహీరాబాద్): కేతకిలో దుర్గామాతగా చాముండేశ్వరిదేవి



జహీరాబాద్ టౌన్: కరెన్సీ నోట్ల అలంకరణలో కన్యకా పరమేశ్వరి

బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు



కాలువలోని చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: మున్సిపాలిటీలోని 2, 3 వార్డులకు సంబంధించిన మహిళలు బతుకమ్మ సంబురాలను నిర్వహించుకునేందుకు అనువైన స్థలాన్ని మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ పరిశీలించారు. డీఎస్పీ కార్యాలయం సమీపంలోని వాగు పక్కన స్థలాన్ని ఎంపిక చేశారు. పరిసరాలను శుభ్రం చేసి మట్టి పోసి చదును చేశారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హైమాస్ట్ లైట్లు, తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

పటాన్‌చెరు టౌన్‌లో...

పటాన్‌చెరు టౌన్: బతుకమ్మ సంబరాల సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని కాలనీలో బతుకమ్మ సంబరాలు జరిగే పలుచోట్ల పారిశుద్ధ్య పనులు చేయించారు. శాంతినగర్, జె.పి కాలనీలోని వేణుగోపాలస్వామి దేవాలయం సమీపంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇబ్బందులు కలిగించొద్దు

సదాశివపేట(సంగారెడ్డి): మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకొనేందుకు చెరువులు, కుంటల వద్ద అధికారులు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఉబచెరువు, రేణుక ఎల్లమ్మ, సాగర్‌నగర్‌కుంట, ఏర్రకుంట, సిద్దాపూర్ చెరుకు వాణి వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పనులను మున్సిపల్ కమిషనర్ ఉమ, ఇంజనీర్ రాజేష్‌తో కలిసి ఆమె పరిశీలించారు. చెరువులు కుంటల వద్ద లైటింగ్ సిస్టం, టెంట్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

భూమిని కాజేశారు.. న్యాయం చేయండి

జహీరాబాద్: తన తండ్రి పేరిట ఉన్న భూమిని కుటుంబ సభ్యులు కాజేశారని, చిన్నారి విద్యశ్రీ తహసీల్దార్ రవీందర్‌ను కోరింది. మంగళవారం మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన విద్యశ్రీ అమ్మమ్మ లక్ష్మితో కలిసి వినతిపత్రం అందజేశారు. నా చిన్నతనంలోనే తండ్రి శ్రీనివాస్ మరణించాడని, తల్లి మరో వివాహం చేసుకుని వెళ్లిపోయిందని తెలిపింది. అమ్మమ్మ వద్ద ఉంటున్నానని, కుటుంబ సభ్యులు తప్పుడు సమాచారం ఇచ్చి, తన తండ్రికి సంబంధించిన భూమిని విక్రయించి, తనకు దక్కకుండా చేశారని చెప్పారు. ఈ విషయంలో విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్‌ను వేడుకుంది. కలెక్టర్‌కు సైతం వినతిపత్రం ఇచ్చినట్లు వివరించింది.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న చిన్నారి

వ్యక్తి అదృశ్యం

జహీరాబాద్ టౌన్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మొగుడంపల్లి మండలంలోని ఖంజమల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ. ప్రభాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఖంజమల్‌పూర్‌కు చెందిన బంటు శ్రీనివాస్(39), ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుడికి అండగా ఎమ్మెల్యే దంపతులు



ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే దంపతులు

నారాయణఖేడ్: కల్హేర్ మండలం రాపర్తి గ్రామానికి చెందిన శేఖర్ కుమారుడు హర్షవర్ధన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు మంగళవారం బాలుడితో పాటు తల్లిదండ్రులను ఖేడ్‌లోని స్వగృహానికి పిలిపించి, ఆర్థిక సాయం అందజేశారు. బాలుడి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి రూ.3 లక్షల ప్రతిపాదనలు పంపారు. త్వరగా ఆర్థిక సాయం చెక్కు మంజూరయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బాలుడితో పాటు తల్లిదండ్రులు ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివ రాథోడ్, నాయకులు పండరిరెడ్డి, అఖిలేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

తహసీల్దార్ రంగారావు

పటాన్‌చెరు: పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటును నవంబర్ 6వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో కూడా అవకాశం ఉందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రేపు భవాని భక్తుల పాదయాత్ర

జహీరాబాద్ టౌన్: చారిత్రాత్మకమైన భవానమ్మపల్లి (ఖంజమల్‌పూర్) నుంచి భవానిమాత ఆలయం వరకు నిర్వహించే, భవాని భక్తుల పాదయాత్ర ఈ నెల 10న ప్రారంభమవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. శరన్నవరాత్రుల నేపథ్యంలో ప్రతి సంవత్సరం భక్తులు భవాని మందిరం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారు. ఈ సంవత్సరం కూడా పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు.

◆ మట్టిలో మాణిక్యం శిరీష

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మహదేవ్‌పల్లికు చెందిన చింతకాయల రాములు– సునంద దంపతులకు ముగ్గురు కుమార్తెలు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించారు. వారి చిన్న కూతురు శిరీష సోమవారం వెలువడిన ఎంబీబీఎస్ కౌన్సిలింగ్ ఫలితాల్లో గవర్నమెంట్ మెడికల్ కాలేజీ జగిత్యాల్లో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించింది. శిరీష సీటు సాధించడంతో గ్రామస్తులు అభినందించారు.

పెద్దోళ్ల రమేష్ సత్తా..

మండలంలోని ఫత్తేపూర్‌కు చెందిన పెద్దోళ్ల రమేష్ ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించాడు. మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి రమేష్‌ను శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ రాంసింగ్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

◆ నియామకం

నారాయణఖేడ్: సీపీఎం నారాయణఖేడ్ ఏరియా కమిటీ కార్యదర్శిగా నల్లవల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కార్యవర్గ సభ్యుడు అతిమేల మాణిక్ మంగళవారం తెలిపారు. ఖేడ్‌లో నిర్వహించిన పార్టీ మహాసభల్లో ఎన్నిక జరిగిందన్నారు. కమిటీ సభ్యులుగా అరుణ్‌కుమార్, సతీష్, సంగ్రామ్, శకుంతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. ఖేడ్ ప్రాంత సమగ్రాభివృద్ధికి పార్టీ తరపున ఉద్యమాలు రూపొందిస్తామన్నారు.

◆ పోరాటాలు ఉధృతం చేయాలి

పటాన్‌చెరు: కార్మికుల చట్టపరమైన హక్కుల కోసం కార్మిక పోరాటం మరింత ఉధృతం చేయాలని వాగ్వాల్స్ యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య పేర్కొన్నారు. మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని వాగ్వాల్స్ పరిశ్రమలో వేతన ఒప్పందం అయినా సందర్భంగా కార్మికులకు పెరిగిన ఒక నెల వేతనాన్ని సీఐటీయూ ఉద్యమనిధికి యూనియన్ అధ్యక్షుడు రాజయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధి అందించినా కార్మికులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆఫీజ్, మురళీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ వ్యక్తికి గాయాలు

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చిరాగ్‌పల్లి ఎస్ఐ. ప్రభాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. మంగళవారం 65వ జాతీయ రహదారిపై సత్వార్ దాబా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బలమైన గాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. ఆచూకీ తెలిస్తే చిరాగ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో లేదా 8712656766 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

◆ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా టీఎన్జీఓ అధ్యక్షుడు ఎండీ జావీద్ అలీ, కార్యదర్శి రవి ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ప్రతినెల 1వ తారీఖున జీతాలు వేయడం వల్ల ఉద్యోగులందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలను దసరా కానుకగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, పి.వెంకటరెడ్డి, కోశాధికారి జి.శ్రీనివాస్, నారాయణఖేడ్ తాలూకా అధ్యక్షుడు చందా.శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు నారాయణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ పాల్గొన్నారు.



విద్యార్థిని హానీషాతో ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు భవన్స్ విద్యార్థిని

సంగారెడ్డి: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు బీహెచ్ఈఎల్ భారతీయ విద్యాభవన్స్ విద్యార్థిని హానీషా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి తెలిపారు. సెప్టెంబర్‌లో తమిళనాడు రాష్ట్రంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో 20–22 కేజీల విభాగంలో పాల్గొని ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు పేర్కొన్నారు. 9 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్న హానీషాను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, హెడ్ మిస్ట్రెస్ భాను నిర్మల, పీఈటీ విభాగం అభినందించారు.

పీఆర్టీయూలో జహీరాబాద్ టీచర్లకు స్థానం



పీఆర్‌టీయూలో స్థానం పొందిన ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో జహీరాబాద్ ఉపాధ్యాయులకు స్థానం దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గానికి చెందిన పలువురు టీచర్లకు కమిటీలో పదవులు దక్కాయి. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా డి.శ్రీనివాస్, సురేందర్, నర్సయ్య, ప్రదీప్‌కుమార్, బాలయ్య, వరాలు, రమేష్ బాణోత్, ఆంజనేయులు, విఠల్, నర్సింలు, కవిత, అమర్నాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హీరాలాల్, బాగయ్య, రేణుక దేవి, వెంకటేశం, బి.శ్రీనివాస్, ఆనంద్, శివ కుమార్, ప్రకాష్, మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శులుగా సుభాష్‌రెడ్డి, ఆశ్రీత, ప్రకాష్‌రావు, స్వామిదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రామాల్లో డీఎల్‌పీఓ పర్యటన

హత్నూర(సంగారెడ్డి): హత్నూర, మధుర, బోరుపట్ల గ్రామాల్లో డీఎల్‌పీఓ అనిత మంగళవారం పర్యటించారు. హత్నూర గ్రామపంచాయతీలో స్థల వివాదంపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. మధుర గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి, డంప్‌యార్డు, వైకుంఠధామాన్ని పరిశీలించారు. అలాగే, బోరుపట్ల గ్రామ శివారులో ఓ పరిశ్రమ నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రక్షిత మంచినీటి పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఆమె వెంట ఎంపీఈఓ యూసుఫ్, కార్యదర్శులు మహేష్, అనురాధ, తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

పొట్ట దశలోనే తెగుళ్లు నివారించాలి

● ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): వరి దుబ్బు వేసే దశ నుంచి పొట్ట దశలో బ్యాక్టీరియా ఎండుతెగులు ఆశిస్తుందని ఏడీఏ నూతన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మీర్ఖాన్‌పేటలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలు నాలుగైదు రోజులు పడినప్పుడు రాత్రి ఉష్ణోగ్రతలు 22 డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు ఎండు తెగులు వ్యాపిస్తుందని చెప్పారు. ప్రధానంగా ఆకుల చివరి భాగంలో పసుపు రంగులో మచ్చలు ఏర్పడి పైభాగం నుంచి కింది భాగం వరకు అలల మాదిరిగా వ్యాప్తి చెందుతుంది. ఆకుల అంచున ఎండిపోవడం ప్రధాన లక్షణమని తెలిపారు. ఇది కేవలం బ్యాక్టీరియా ఎండు తెగులుగా నిర్ధారించి, నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలన్నారు. నివారణకు అగ్రిమైసిన్ 0.4 గ్రాములు ఒక లీటర్ నీటిలో లేదా ప్లాంటోమైసిన్ 0.4 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి వేసిన రైతులు తెగుళ్ల గమనించినప్పుడు నత్రజని ఎరువులను వాయిదా వేసుకోవాలని వివరించారు. కంకినల్లి నివారణకు స్పైరోమెసిఫిన్ 1.0మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తెగుళ్ల ఆశించినప్పుడు దిగుబడి కూడా తగ్గుతుంది. కావున వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ తగు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి పాల్గొన్నారు.



కల్హేర్: వరి పైరును పరిశీలిస్తున్న నూతన్‌కుమార్

రైతుల సమస్యలపై సమావేశం



సమావేశమైన రైతులు

సంగారెడ్డి : రైతుల సమస్యలపై సంగారెడ్డి రైతు వేదికలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు రక్షణ సమితి అధ్యక్షుడు రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ.. రైతుల ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య రుణమాఫీ అని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. కాలయాపన చేస్తే పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సంగారెడ్డి రైతు విస్తరణ అధికారి శ్రావణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతలుగా రుణమాఫీ చేసిందన్నారు. సాంకేతిక కారణాల వల్ల మాఫీ కాని వారు ఉంటే వారి డాటాను ఎంట్రీ చేస్తామన్నారు. రెండు లక్షల మాఫీపై ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదని తెలిపారు. కార్యక్రమంలో గౌవర అధ్యక్షుడు రాంరెడ్డి, సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి, రైతులు రామానుజరెడ్డి, పాపయ్య సంజీవరెడ్డి, మల్లేశ్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడపొద్దు

● పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ట్రాఫిక్ నిబంధనలు తూ.చ తప్పకుండా ప్రతి ఒక్కరూ పాటించాలని, తాగి వాహనాలను నడపొద్దని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ అన్నారు. పట్టణంలో డీసీఎం వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఏర్పాటు చేసుకున్న సందర్భంగా మంగళవారం డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలూనాయక్‌ను వేర్వేరుగా కలిసి బొకే అందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం సేవించి, వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారినపడే అవకాశం ఉందన్నారు. అలాగే, ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు